నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# హైదరాబాద్

మంగళవారం 5 డిసెంబర్ 2023 | TUESDAY, DECEMBER 5, 2023 | HYDERABAD | పేజీలు : 8 PAGES




సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, లాస్యనందిత



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

# ప్రజల్లోనే ఉందాం

## ప్రతిపక్ష బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దాం

- త్వరలోనే పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశం
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గ్రేటర్ ఎమ్మెల్యేలకు అభినందనలు

సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : పదేండ్లలో బీఆర్ఎస్ అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టడంతోనే గ్రేటర్‌లో బీఆర్ఎస్‌కు గౌరవప్రదమైన స్థానాలను కట్టబెట్టారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ప్రజలు మనకు అందించిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దామన్నారు. గ్రేటర్‌లో గెలుపొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. త్వరలోనే పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు పోదామని ఆయన సూచించారు. తెలంగాణ భవన్ కేంద్రంగా ప్రజలకు అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. అనంతరం ఎర్రవెల్లిలో పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.





బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు బండారు లక్ష్మారెడ్డి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ

- మిచౌంగ్ తుఫాన్ ఎఫెక్ట్

# రెండు రోజులు గ్రేటర్‌కు వర్ష సూచన

## ఎల్లో హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ కేంద్రం

సిటీబ్యూరో, డిసెంబరు 4 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో గ్రేటర్‌లో సోమవారం అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిశాయి. రాగల 24 గంటల్లో తుఫాను ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. వర్షం కారణంగా నగరంలో వాతావరణం చల్లబడింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 27.5డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22.5డిగ్రీలు, గాలిలో తేమ 66శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

# అభినందనల వెల్లువ

సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ) : అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు పార్టీ నాయకులు, ముఖ్యనేతలు, గులాబీ శ్రేణులు, అభిమానుల నుంచి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెలువెత్తాయి. ఉదయం నుంచి ఎమ్మెల్యేల నివాసాలు, పార్టీ క్యాంపు కార్యాలయాలలో సందడి వాతావరణం నెలకొన్నది. ఎమ్మెల్యేలకు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రేణులు స్వీట్లు పంచుకుంటూ సంబురాలు చేసుకున్నారు.



ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న దివ్యాంగులు